



పకడ్బందీగా వైద్య కళాశాల
భవనాల డిజైన్

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- బిల్డింగ్ డిజైన్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో భేటీ

ఖమ్మం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం వద్ద రూ.166 కోట్లతో నూతనంగా నిర్మించబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించి బిల్డింగ్ డిజైన్ కన్సల్టెన్సీ భవన నిర్మాణాల ప్రతినిధులతో శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. మోడల్‌గా నిర్మించబోతున్న మెడికల్ కళాశాల తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ప్రొఫెసర్ల క్వార్టర్లు, స్టాఫ్ క్వార్టర్ల కోసం కేటాయించిన స్థలంలో ఏ భవనం ఎక్కడ నిర్మిస్తే బావుంటుందనే విషయమై చర్చించారు. కాలేజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ల బృందంతో చర్చించి వారి సూచనల మేరకు భవనాలను నిర్మించాలని తుమ్మల సూచించారు. జిల్లా మైనింగ్ శాఖ అధికారులతో మాట్లాడి మెడికల్ కళాశాలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని గతంలో మట్టికోసం ఎవరైతే తవ్వారో వారితోనే ఆ గోతులను పూడ్చించి చదును చేసి ఇవ్వాలని మైనింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ అనంతరం శంకుస్థాపన చేయనున్నారు.

సమస్యలు తెలుసుకున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామాల్లో తిరుగుతూ స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. మంగాతండాలో హనుమంతుని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంగిడి, మంచుకొండలో స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. ఈర్లపూడిలో నూతన దంపతులను ఆశీర్వదించారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 12: రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం పాలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30గంటల నుంచి కొత్తగూడెంలోని విద్యానగర్ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. ఈ వివరాలను పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జీ తుంబూరి దయాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ వెలవెలబోతున్నాయి. ప్రైవేటు మార్కెట్లో ధాన్యానికి మంచి ధర పలుకుతుండడంతో రైతులు కల్లాల్లో ధాన్యాన్ని అట్నుంచి అటే విక్రయించుకుంటున్నారు. మిల్లర్లు కూడా పోటీ పడి మరీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపే చూడడం లేదు. ప్రభుత్వం ఎ-గ్రేడ్ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తుండగా, ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు క్వింటాలుకు రూ.3వేల వరకు చెల్లిస్తున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా అమ్ముకొని, వెంటనే నగదు అందుకునే అవకాశం ఉంటుండటంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో లక్షా 54వేల ఎకరాల్లో యాసంగి వరి సాగు జరగ్గా, ధాన్యం దిగుబడి అంచనా 3.75లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంది. ఎన్నెస్పీ క్రాప్ హాలిడేతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఈ సారి ఎక్కువగా బోర్ల కిందనే వరి సాగు చేశారు.





సర్కారుకు నై.. ప్రైవేటుకు జై...

- ధాన్యం అమ్మకాల్లో వ్యాపారుల వైపే రైతన్న మొగ్గు
- వెలవెలబోతున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- బయట మార్కెట్‌లో ఎక్కువ ధర వస్తుండటమే కారణం
- ప్రభుత్వ మద్దతు ధర రూ. 2,183 / రూ.2,203
- రూ.3వేల వరకు చెల్లిస్తున్న ప్రైవేటు వ్యాపారులు
- ఉమ్మడి జిల్లాలో లక్షా 54 వేల ఎకరాల్లో యాసంగి వరిసాగు
- ధాన్యం దిగుబడి అంచనా 3.75 లక్షల మెట్రిక్ టన్నులు
- ఎన్నెస్పీ క్రాప్ హాలిడేతో ఉమ్మడి జిల్లాలో గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 12: ఖమ్మం జిల్లాలో యాసంగి వరి ధాన్యం సేకరణకు 157 కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1న ప్రారంభించారు. ప్రతి సీజన్‌లోనూ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించే ధాన్యంలో దాదాపు 25 శాతం ఖమ్మం జిల్లా నుంచే ఉంటుంది. కానీ ఈ సారి సాగర్ జలాలు రాకపోవడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతేడాది 2.50లక్షల ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది లక్షా 2వేల ఎకరాల్లోనే సాగయింది. అదీ బోర్లు, బావుల కింద మాత్రమే పండింది. దీంతో ఈ సీజన్‌లోనూ 2లక్షల 46వేల 612 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో 157 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాలని నిర్దేశించారు.

సన్న బియ్యానికి డిమాండ్

జిల్లాలో ఈసారి ఎన్నెస్పీ కింద క్రాప్ హాలీడేను ప్రకటించారు. దీంతో ఆయకట్టు మొత్తం పడావుపడింది. కానీ బోర్లు, నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో మాత్రం రైతులు సన్నరకాలనే సాగు చేశారు. అవి పంటకు వచ్చాయి. ఈ సారి వర్షాలు పడకపోవడం క్రాప్ హాలీడే ఫలితంగా ధాన్యం దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీనికి తోడు మార్కెట్లో బియ్యానికి మంచి గిరాకీ ఉంది. ప్రభుత్వ మద్దతు ధరకన్నా బయట మార్కెట్లోనే రేటు అధికంగా పలుకుతోంది. క్వింటా బియ్యం రూ.6వేల నుంచి 6500 పలుకుతుంది. దీనికి తోడు భవిష్యత్తులో ఇంకా బియ్యం ధరలు పెరిగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు. క్వింటాకు రూ.3వేలకు పైగా చెల్లించి అదీ కల్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకురావడం లేదని తెలుస్తోంది. క్వింటాకు కనీసం వెయ్యి రూపాయలు అదనంగా లభిస్తుండడంతో రైతులు కూడా ధాన్యాన్ని వ్యాపారులు, మిల్లర్లకే విక్రయించుకుంటున్నారు.

	వరి సాగు	ధాన్యం దిగుబడి అంచనా
ఖమ్మం జిల్లాలో	1.02 లక్షల ఎకరాలు	2,46,612 మెట్రిక్ టన్నులు
భద్రాద్రి జిల్లాలో	51,739 ఎకరాలు	1,29,348 మెట్రిక్ టన్నులు

ఎ-గ్రేడ్ రకానికి మద్దతు ధర	రూ 2203
సాధారణ రకం	రూ 2,183

ఎగబడుతున్న మిల్లర్లు..

ఖమ్మం జిల్లాలో ధాన్యాన్ని మిల్లర్లు బయటి జిల్లా వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. సత్తుపల్లి ప్రాంతాల్లో ఆంధ్రా నుంచి ఇటు కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ ప్రాంతాల్లో మిర్యాలగూడెం, కోదాడ సూర్యాపేట, నల్గొండ జిల్లాల నుంచి వ్యాపారులు, మిల్లర్లు పెద్ద సంఖ్యలో ధాన్యాన్ని అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో వరిసాగు తగ్గిపోవడం, దిగుబడులు రాకపోవడంతో బియ్యానికి ధరలు పెరుగుతున్నాయి. సన్నబియ్యం, సాంబ మసూరి బియ్యానికి

మిగతా 6వ పేజీలో...

పెళ్లి చేసుకోవడం
ఇష్టం లేక...

- డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని ఆత్మహత్య
- నారాయణపురంలో విషాదం


గూడూరు నవ్య

తల్లాడ, ఏప్రిల్ 12: ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్షతో ఉన్న యువతికి పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గూడూరు నవ్య (20) ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతోంది. నాలుగేళ్ల క్రితం తల్లి పాముకాటుకు గురై చనిపోయింది. అప్పటినుంచి తండ్రి నర్సిరెడ్డి అన్నీ తానై పోషణ బాధ్యతలు చూసుకుంటున్నాడు. నవ్యకు పెళ్లీడు రావడంతో పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. అయితే తనకు ఇప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని నవ్య చెప్పింది. తండ్రి నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో నవ్య పురుగులమందు తాగింది. వెంటనే చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. వ్యవసాయదారుడైన నర్సిరెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, పెద్ద కుమార్తెకు వివాహమైంది. నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లొంగిపోయిన మావోయిస్టు దళసభ్యుడికి చెక్ అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

అభివృద్ధిని అడ్డుకుంటున్న
మావోయిస్టు పార్టీ

- అమాయకులను దళాల్లో చేర్చుకొని బలిపశువులను చేస్తున్నారు
- 'ఆపరేషన్ చేయూత'కు స్పందించి నలుగురి లొంగుబాటు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు

చర్ల/కొత్తగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే అమాయక ప్రజలను బలవంతంగా మావోయిస్టు పార్టీలోకి చేర్చుకుని తమ ఉనికి కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం వారిచేత చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత మావోయిస్టు పార్టీ అజ్ఞాత దళాల్లో పనిచేస్తున్న వారి కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికోసం చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకుని అభివృద్ధి నిరోధకులుగా మావోయిస్టులు వ్యవహరిస్తున్నారన్నారు. చిన్న సమస్యలు, కారణాల వల్ల కుటుంబాలను వదిలేసి తెలిసి తెలియక మావోయిస్టు పార్టీలోకి వెళ్లి చాలామంది అమాయకులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అజ్ఞాతంలో వున్న వారు జనజీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వం నుంచి అందే అన్ని రకాల ప్రతిఫలాలను పొందాలని విజ్ఞప్తి చేశారు. కాగా 'ఆపరేషన్ చేయూత'కు స్పందించి నలుగురు దళసభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ వెల్లడించారు. చర్ల మండలం బూర్గుపాడుకు చెందిన వంజం దేవ, కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన కాంపెల్లి రాజ్‌కుమార్ అలియాస్ రంజిత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ మండలం తిమ్మాపూర్‌కు చెందిన సోడిగంగా అలియాస్ అశోక్, సుక్మా జిల్లా డోకుపాడు గ్రామానికి చెందిన కల్మ దేవేలు నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక, అగ్రనాయకుల వేధింపులు తట్టుకోలేక శుక్రవారం పోలీసుల ఎదుట లొంగిపోయిందని తెలిపారు.

రివార్డుల అందజేత

ఇటీవల లొంగిపోయిన నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన దళసభ్యులైన చర్ల మండలానికి చెందిన మడివి కృష్ణకు రూ.4లక్షలు, అడవి రామవరం గ్రామం గుండాల మండలానికి చెందిన పూణేం ఆడమయ్యకు లక్ష రూపాయలు, పెంటపాడు గ్రామం చింతగుప్ప సుక్మా జిల్లాకు చెందిన వెట్టి భీమాకు లక్ష రూపాయలు ఎస్పీ చెక్కుల రూపంలో అందజేశారు.

కమాండ్ కంట్రోల్ ప్రారంభం

మేము సైతం కార్యక్రమంలో భాగంగా చర్ల మండలంలోని వ్యాపారస్తులు, ప్రజలు స్వచ్ఛందంగా తమ తమ ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయించేందుకు గాను సుమారుగా చర్ల పోలీసులకు రూ.9 లక్షల 50 వేలు అందజేశారు. నేరాల నియంత్రణ కొరకు చర్ల మండలంలో మొత్తం 54 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చర్ల పోలీస్‌స్టేషన్‌లో వీటికి సంబంధించిన కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కమాండ్ కంట్రోల్‌ను ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు.

అనంతరం చేయూత కార్యక్రమానికి హాజరైన దళ సభ్యుల కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎస్పీ స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్‌పీఎఫ్ 51వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సునీల్‌కుమార్, 141వ బెటాలియన్ సీపీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, చర్ల సీఐ రాజువర్మ, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రమేష్, అశోక్‌రెడ్డి, ముత్యం రమేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


ధంసలాపురంలో అసంపూర్తిగా వదిలేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

గూడు దొరికేనా!

- అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- ఏళ్లు గడిచినా పేదల దరిచేరని పథకం
- ఉమ్మడి జిల్లాకు 15వేలకుపైగా ఇళ్ల కేటాయింపు


ఖమ్మం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఘనంగా ప్రారంభించి నిధులు లేక అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల పథకం అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం మారడంతో గతంలో ప్రారంభించి వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తి చేస్తారా లేక వదిలేస్తారా అన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

గతంలో కేసీఆర్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభిచారు. గడిచిన పదేళ్లలో జిల్లా పరిధిలో సుమారు 9వేల ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 7వేల ఇళ్ల వరకు పనులు ప్రారంభించారు. వీటిలో 5వేల ఇళ్లు లబ్ధిదారులకు అందించినట్టు అధికారులు చెబుతున్నా.. అవి కూడా చాలా చోట్ల అసంపూర్తిగానే వదిలేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ కోట్ల రూపాయలతో పనులు ప్రారంభించిన డబుల్ ఇళ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు చింతకాని, రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, వైరా, తల్లాడ, కారేపల్లి, కామేపల్లి, ఏన్కూరుతోపాటు పలు మండలాల్లో కొన్ని ఇళ్లు పూర్తయినా ఇతర మౌలిక సదుపాయాల కల్పన చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. స్లాబులు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ఎండ వేడిమికి ఉండలేకపోతున్నారు.

గిరిజనులు సైతం డబుల్ ఇళ్లలో ఉండలేక సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో పందిళ్లు, పాకలు వేసుకుని ఆరుబయటే నిద్రిస్తున్నారు. ఒక్కో ఇంటికి రూ.ఐదున్నర లక్షలకు పైగా ప్రభుత్వం మంజూరు చేసింది. కోట్లాది రూపాయలతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఐటీడీఏ తదితర ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల ద్వారా ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొదట్లో శంకుస్థాపన చేసిన పనులన్నీ పూర్తి కాగా, ఆ తర్వాత మంజూరైన డబుల్ ఇళ్లు పునాదుల స్థాయిలో కొన్ని స్లాబులు వేసి నిర్మాణంలో వదిలేశారు. వీటిని పూర్తి చేయాలంటే మళ్లీ అదేస్థాయిలో సొమ్ములు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఖమ్మం జిల్లా పరిధిలో 9వేల ఇళ్లు, భద్రాద్రి జిల్లాలో 6వేల పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాగా, ఆ జిల్లాలో కూడా సగానికిపైగా నిర్మాణం కాలేదు. పనులు ప్రారంభించినా అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించలేదు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్ష్యం పక్కదారి పట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తుందా... లేక నిరుపయోగంగా ఉంచుతుందా.. అన్నది వేచి చూడాలి.





హోరెత్తిన ఎస్టీ మోర్చా ర్యాలీ

- గిరిజనుల అభివృద్ధికి మోదీ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు..: కల్యాణ్
- పాల్గొన్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు, ఇతర నేతలు
- ప్రదర్శనలో ఆకట్టుకున్న గిరిజనుల సంప్రదాయ నృత్యాలు

6


మాట్లాడుతున్న రవిచంద్ర

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- సమీక్షల పేరుతో గ్యారంటీల అమలులో తాత్సారం
- బీఆర్ఎస్ అభ్యర్థి 'నామా'ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు

6

పాత ధరే..

రామయ్య ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ రూ.30
రూ.50కి పెంచేందుకు సర్కారు నో..

6


అవకాశవాద కాంగ్రెస్‌కు
బుద్ధి చెప్పాలి...

తప్పుచేశామని ప్రజలు బాధపడుతున్నారు..
మాజీ మంత్రి సత్యవతి, ఎమ్మెల్సీ మధు

7

'ధరణి' విలాపం

- ముందుకు సాగని ధరణి స్పెషల్ డ్రైవ్
- ఎక్కడి సమస్యలు అక్కడే
- ఆర్‌ఎస్‌ఆర్ సమస్యకు దొరకని పరిష్కారం
- ఎన్నికల నేపథ్యంలో పూర్తిగా నిలిచిపోయిన డ్రైవ్
- కోడ్ ముగిసిన తరువాత కూడా అనుమానమే..



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని, దాని స్థానంలో మెరుగైన, పారదర్శకమైన పోర్టల్ అందుబాటులోకి తెస్తామని ఎన్నికల సమయంలో ఆ పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ధరణి పోర్టల్ వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు, పోర్టల్ ప్రక్షాళనపై అధ్యయనానికి కమిటీని నియమించారు. కమిటీ సిఫారసులు అందేలోపుగా ఇప్పటికే ధరణి గ్రీవెన్స్‌లో భూ సమస్యలకు సంబంధించి ధరఖాస్తు చేసుకొని పరిష్కారం కోసం ఎదురు చూస్తున్న రాష్ట్రంలోని 2.7లక్షల దరఖాస్తులను పరిష్కారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం తహసీల్దార్, ఆర్డీవోలకు కూడా లాగిన్ ఇచ్చింది. కొన్ని అప్షన్లకు సంబంధించి మాత్రమే వారాకి లాగిన్ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో ధరణి ప్రత్యేక డ్రైవ్‌కు ముందు 10,265 పైగా దరఖాస్తులు ధరణి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు అంచనా వేశారు.

సత్తుపల్లి, ఏప్రిల్ 12: ధరణి గ్రీవెన్స్‌లో భూ యజమానులు చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం గత నెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సమయం ప్రకటించింది. 9వ తేదీ లోపుగా అధికారులు దరఖాస్తులు పరిష్కరించాలని సూచించింది. ఈ క్రమంలో దరఖాస్తులు తిరస్కరించాల్సి వస్తే భూ యజమానులకు కారణం కూడా వివరించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి పొంగులేటి జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియను సమీక్షించారు.

తహసీల్దార్, ఆర్డీవోలకు లాగిన్

స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం తహసీల్దార్, ఆర్డీవోలకు లాగిన్ కల్పించింది. ఖాతా మెర్జింగ్ (రెండు ఖాతా నెంబర్లు ఉన్న యజమానికి ఒకే ఖాతాలో చేర్చటం), తప్పుగా నమోదైన పేర్లు, ఫోటో మార్పు, ఆధార్ నెంబర్ తప్పుగా నమోదైతే సరి చేయటం, జండర్ మార్పు తదితర వివరాలు సరి చేయటం (ఫస్ట్ పేజీ కరెక్షన్), డిజిటల్ సైన్ అవకాశాలను తహసీల్దార్‌కు ఇచ్చారు. రూ.అయిదు లక్షల విలువ లోపు కలిగిన భూములకు సంబంధించి మిస్సింగ్ సర్వే నెంబర్, పాస్ పుస్తకం లేకుండా నాలా కన్వర్షన్‌కు సంబంధించి ఆర్డీవోలకు అధికారం కల్పించారు. రూ.5 లక్షల విలువ కంటే ఎక్కువ రూ.50లక్షల విలువ లోపు భూముల మిస్సింగ్ సర్వే నెంబర్‌కు సంబంధించి కలెక్టర్, ఆ పైన విలులైన భూముల దరఖాస్తులను పరిష్కారం కోసం చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)కు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గడువు పొడిగింపు

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి గత నెల 9వ తేదీ వరకు ముందుగా గడువిచ్చిన ప్రభుత్వం ఆ తరువాత గడువు పొడిగించింది. అయినా దరఖాస్తుల పరిష్కారం మాత్రం పూర్తి కాలేదు. ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఆర్‌ఎస్‌ఆర్ లాంటి సమస్యలతో ముడిపడి ఉన్న దరఖాస్తుల పరిష్కారం ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత కూడా సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పరిష్కారానికి నోచని సమస్య

రైతులు ప్రధానంగా ఆధార్ నెంబర్ తప్పుగా నమోదవటం, పేర్లు, జండర్ తప్పుల సవరణకోసం, భూముల విస్తీర్ణం, సర్వే నెంబర్ మిస్సింగ్, వారసత్వ, నాలా తదితర సమస్యలతో దరఖాస్తు చేసుకున్నారు. భూములను దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్నా కొత్త పాస్‌పుస్తకాలు జారీ కాకపోవటం ప్రధాన సమస్యగా ఉంది. ధరణి పోర్టల్ ప్రవేశపెట్టటానికి ముందు అప్పటి ప్రభుత్వం అధికారులకు తగినంత సమయం ఇవ్వకుండా హడావిడిగా రికార్డుల ప్రక్షాళ, ఎల్ఆర్‌యూపీ నుంచి ధరణిలో నమోదు సమయంలో పలు తప్పులు దొర్లాయి. దీంతో పలువురు తమ భూములకు సంబంధించి పాస్‌పుస్తకాలు పొందలేకపోయారు. కొందరికి పాస్‌పుస్తకాలు వచ్చిన అందులో కొన్ని సర్వే నెంబర్లలో భూమి మాత్రమే నమోదైంది. ఇతర సర్వే నెంబర్లలో భూములున్నా రికార్డుల్లో నమోదు కాలేదు. మిస్సింగ్ సర్వే నెంబర్ సమస్య పరిష్కారం కోసం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. కాని సమస్య ఏళ్ల గడుస్తున్నా పరిష్కారం కాలేదు.

ఆర్ఎస్ఆర్‌తో అసలు సమస్య

ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ అధిక శాతం దరఖాస్తులు ఆర్ఎస్ఆర్‌తో ముడిపడి ఉన్నవే ఉన్నాయి. రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్(ఆర్ఎస్ఆర్) ప్రకారం రికార్డుల్లో ఒక సర్వే నెంబర్‌లో ఉండాల్సిన విస్తీర్ణం కంటే అదనంగా ఎవరి పేరుతో అయినా నమోదు చేయాలంటే ధరణి పోర్టల్ అనుమతించదు. సమస్యను పరిష్కరించాలంటే సదరు సర్వే నెంబర్‌లలో భూమి లేకుండా రికార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిని తొలగిస్తే వాస్తవంగా భూమి సాగు చేసుకుంటున్న వారి సర్వేనెంబర్, విస్తీర్ణం నమోదు చేయవచ్చు. కాని ధరణి చట్టం ప్రకారం ఒక్క సారి ధరణిలో వివరాలు నమోదైతే ఎవరి భూమిని తొలగించే అధికారం ఎవరికీ లేదు. ప్రస్తుతం ఆర్ఎస్ఆర్ సమస్యతో ముడిపడి ఉన్న దరఖాస్తులను సీసీఎల్ఏ కు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. కాని క్షేత్ర స్థాయిలో ఆర్ఎస్ఆర్ ఖాళీ లేకుండా దరఖాస్తులు సీసీఎల్ఏకు వెళ్లినా ప్రయోజనం ఏముంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. 70శాతం దరఖాస్తులు ఆర్ఎస్ఆర్ సమస్యతో ఉన్నయి. తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీవో జిల్లా కలెక్టర్ నివేదికలతో సీసీఎల్ఏకు పంపిన ఫైళ్లు కూడా పెద్ద సంఖ్యలో సీసీఎల్ఏ నుంచి తిరస్కరణకు గురవటంతో పలు జిల్లాల్లో యంత్రాంగం కూడా దరఖాస్తుల పరిష్కారం పట్ల పెద్దగా ఆసక్తి కనబర్చటం లేదనే వాదన వినవస్తోంది.

గాడి తప్పుతున్న గురుకులాలు

- వ్యక్తిగత కక్షలకు విద్యార్థులను వాడుకుంటున్న వైనం
- అశ్వారావుపేట మైనారిటీ గురుకులంలో జరిగిన ఘటనే నిదర్శనం
- బాధ్యులపై చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు లెక్చరర్లు, వార్డెన్లు



ఖమ్మం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తప్పటడుగుల నుంచి తప్పించాల్సినవారే తప్పుడు పనులు చేస్తున్నారు. పిల్లలను సక్రమ మార్గంలో నడిపి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన వారే అక్రమమార్గంవైపు అడుగులు వేస్తున్నారు. ఇది జిల్లాలోని పలు గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో కొందరు అధ్యాపకులు, ఇతర సిబ్బంది అవలంబిస్తున్న తీరు. ఆయా సంఘటనలు వెలుగులోకి వచ్చిన సందర్భంలో సదరు ఉపాధ్యాయులను కేవలం విధుల నుంచి పక్కనపెట్టి చేతులు దులుపుకొంటున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఆయా సంఘటనల్లో చర్యలు తీసుకోకుండా ఉండేందుకుగాను ముడుపులు దండుకుంటున్నారన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

అశ్వారావుపేటలోని మైనారిటీ గురుకుల కళాశాలలో కొద్ది రోజుల క్రితం విద్యార్థుల పేరు మీద... సొసైటీతో పాటు, ప్రభుత్వంలోని పెద్దలకు ఓ లేఖ వెళ్లింది. కళాశాలలో పనిచేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ తమను వేధిస్తున్నారనేది ఆ లేఖ సారాశం. దీనిపై సంబంధిత శాఖ రాష్ట్రస్థాయి అధికారుల నుంచి విచారణకు ఆదేశించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరు అవుట్‌సోర్సింగ్ లెక్చరర్లు వైస్ ప్రిన్సిపాల్‌పై వ్యక్తిగత కక్షతో విద్యార్థులను బెదిరింపులకు గురిచేసి ఫిర్యాదు రాయించినట్టు తేలింది. ఈ సంఘటనతో వైస్ ప్రిన్సిపాల్ అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైనట్టు తెలిసింది. అయితే ఈ సంఘటనలో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్న అధికారులు... గుట్టుచప్పుడు కాకుండా విచారణ నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. బినామీ లేఖ రాయించిన సంబంధిత లెక్చరర్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ఆదేశాలురాగా, కేవలం వారి నుంచి రాజీనామా పత్రాలు తీసుకుని ఇంటికి పంపడం వెనుక పెద్ద ఎత్తున నగదు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇక తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మార్కులు తక్కువగా వచ్చాయంటూ విద్యార్థులను ఓ ఉపాధ్యాయుడు చితకబాదాడు. అయితే తాము ఓ ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్నారన్న కారణంగానే కొట్టారంటూ సదరు విద్యార్థులు బహిరంగంగా ఆరోపించడం గమనార్హం.

ఎన్నో ఆరోపణలు..

గురుకులాలపై జిల్లా అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కొందరు అధ్యాపకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వసతిగృహాల్లో ఉండే విద్యార్థులతో మసాజ్‌లు చేయించుకున్న సంఘటన గతంలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు కొందరు అధ్యాపకులు ఆయా వసతి గృహాలను అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి అయితే చాలు మద్యం పుచ్చుకుని వసతి గృహానికి వెళ్లిన తర్వాత అక్కడ రచ్చ చేస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు. కొందరు ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లలో బాతఖానీలు కొట్టడం సర్వసాధారణంగా మారిపోయిందన్న ఆరోపణలూ ఉన్నాయి. మరికొందరైతే క్లాసురూంల కంటే ఆఫీసు రూంలోనే ఎక్కువగా గడుపుతూ వాట్సప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ ఇతరత్రా అంశాలకే పరిమితం అవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మరోవైపు వార్డెన్లు కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థులను గాలికి వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న వార్డెన్లలో ఎక్కువమంది స్థానికంగా నివాసం ఉండటంలేదన్న ఆరోపణలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వార్డెన్లు స్థానికంగా ఉంటున్నట్టు చూపించుకోవడం కోసం అక్కడ ఒక గదిని అద్దెకు తీసుకుని తమ సొంత నివాసంలో ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవాంఛనీయ సంఘటనలు వెలుగులోకి వచ్చిన సమయంలో ఉన్నతాధికారుల చర్యలు నామమాత్రంగా ఉంటుండటంతో అలుసుగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'తెల్లం' వెంటే మేము..

- బీఆర్ఎస్‌కు భద్రాద్రిలో మూకుమ్మడిగా రాజీనామాలు
- మంత్రుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు
- ఇతర మండలాలలోనూ సమాలోచనలో నాయకులు



బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో కారుకు ఊహించని పరిస్థితి ఎదురవుతోంది. నిన్న మొన్నటి వరకు నియోజకవర్గంలో బలంగా ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన అనంతరం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కుంటోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు విజయం సాధించిన అనంతరం అనతి కాలంలోనే కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో బీఆర్ఎస్‌లో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వెంటే తాము నడుస్తామని భద్రాచలం మండల బీఆర్ఎస్ కార్యదర్శితో పాటు ఇతర అనుబంధ సంఘాలు, బూత్ కమిటీల నాయకులు శుక్రవారం భద్రాచలంలో సమావేశమై తాము పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో కొనసాగుతున్నా తమకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు వారు ప్రకటించారు. బీఆర్ఎస్ మండల, ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి క్రిష్ణమూర్తితో పాటు తాళ్ల రవికుమార్, చింతాడి రామకృష్ణ, కొప్పుల శ్రీనివాస్, గాడి విజయ్, కేతినేని లలిత, మానే కమల, జాష్టి గంగాభారతి తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పట్టణంలో ఉన్న 42 పోలింగ్ బూత్‌లలో 32 పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జ్‌లు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించటం గమనార్హం. ఈ క్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును సమావేశానికి పిలిచి కాం గ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా త్వరలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భద్రాచలం పర్యటనకు రానుండటంతో వారి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తామని ఎమ్మెల్యే వెంక ట్రావు తెలిపారు.

సమాలోచనలో నాయకులు

నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు ఉండగా నియోజకవర్గ కేంద్రమైన భద్రాచలంలో బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు చేయటం ఆ పార్టీ వర్గాలలో సంచలనం సృష్టించింది. కాగా దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలలో కూడా పలువురు నాయకులు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది, ఒక వైపు బీఆర్ఎస్‌కు శు క్రవారం భారీ ఎత్తున రాజీనామా చేయటంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, మాజీ మం త్రి సత్యవతి రాథోడ్ దుమ్ముగూడెం మండలం గంగోలులో నిర్వహించిన సమావేశంపై ఆ ప్రభావం పడినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మండల కమిటీలను పునర్ వ్యవస్థీకరిస్తున్నామని ఆ పార్టీ నాయకులు ప్రకటించటంతో ప్రస్తుతం కమిటీలలో ఉన్న వారిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చర్ల, భద్రాచలం మండలాలకు చెందిన ఐదుగురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇందులో నలుగురుపై సస్పెన్షన్ ఎత్తివేసి వారు పార్టీలోనే కొనసాగుతారని పేర్కొని తనపై మాత్రం సస్పెన్షన్ ఎత్తివేయకపోవటాన్ని ఒక నాయకుడు ప్రశ్నించారు. తాను ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నాయకుడు సామాజిక వర్గం కాకపోవటమే కారణమా అని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో మరింతగా కాంగ్రెస్‌లోకి వలసలు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'ఆస్తి మార్పిడి'కి పీవో ఓకే..

- ఉత్తర్వులు జారీచేసిన ప్రాజెక్టు అధికారి
- వెల్లడించిన చాంబర్ ఆఫ్ కామర్స్

మణుగూరు, ఏప్రిల్ 12: మణుగూరు మునిసిపాలిటీలో సుదీర్ఘ కాలంగా ఆస్తి మార్పిడి జరగడం లేదు. ఈ విషయంపై చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుడు దోసపాటి వెంకటేశ్వరరావు పలు దపాలుగా కమిటీ సభ్యులతో పాటు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కూడా ఈ విషయాన్ని పీవోకు తెలుపగా ఆయన సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పలు ఆదేశాలను మణుగూరు మునిసిపల్ కమిషనర్‌కు జారీ చేశారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తిమార్పిడికి, డెత్ సర్టిఫికెట్స్, ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇతరత్ర ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బంది పడేవారు. అయితే పీవో ఉత్తర్వులతో ఈ సమస్య పరిష్కారం అయిందని దోసపాటి వెంకటేశ్వరరావు

సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు రావాలి

కాగా ఈ విషయంపై హైద్రాబాద్‌లో సీడీఎంఏ నుంచి ఆదేశాలతో పాటు, సంబంధించిన సైట్ కూడా ఓపెన్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. కమిషనర్ చొవరతో ఈ విధానం ఉన్నతాధికారుల ఆదేశాలతో అమలులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కమిషనర్ చర్యలు చేపడితే ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నఈ సమస్యలకు మోక్షం లభించనుంది.



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్

భక్తులకు వసతులు కల్పించాలి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- పారిశుధ్య నిర్వహణలో రాజీ పడొద్దు
- సిబ్బంది ఫోన్ నెంబర్లు సేకరించుకోవాలి
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్

భద్రాచలం, ఏప్రిల్ 12: ఈ నెల 17, 18వ తేదీల్లో జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా వసతి సౌకర్యాలు కల్పించాలని, బాధ్యతలైన అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్‌జైన్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై వివిధ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా తగినన్ని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని, మెడికల్ క్యాంపుల్లో సిబ్బంది నెంబర్లు, వారి లోకేషన్లు సంబంధిత డీఎంహెచ్‌వో దగ్గర ఉంచుకోవాలన్నారు. సిబ్బందికి డ్యూటీ పాస్‌లు అందచేయాలని, జిల్లా సంక్షేమ అధికారి కల్యాణానికి వస్తున్న మహిళలకు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చాలని తెలిపారు. భద్రాచలం పట్టణంలోని విధులు, వార్డులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా సంబంధిత ఈవో ఆయా పంచాయతీ వార్డుల వారీగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని, వారి ఫోన్ నెంబర్లు దగ్గర ఉంచుకోవాలని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు వారికి అవసరమైన సమాచారం అందించడానికి సమాచార కేంద్రాలు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసి మైక్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ఉండాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా లక్ష వాటర్‌ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, జనసంచారం ఎక్కువ ఉన్న చోట వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు. శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి అధికారులు ఏర్పాటుచేసిన సౌకర్యాలను పర్యవేక్షించాలని దేవస్థానం ఈవోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, డీఎంహెచ్‌వో శిరీష ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, డీడబ్ల్యూవో విజేత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షరీఫొద్దీన్, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్

కొణిజర్ల,ఏప్రిల్12: వినియోగదారులకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వాలని ఖమ్మం విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ సిబ్బందిని సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దగోపతి సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, కొత్త సర్వీస్‌లను సకాలంలో ఇచ్చేలా స్పందించాలని తెలిపారు.

కార్పొరేట్ సాగుకు వ్యతిరేకంగా ఉద్యమం

కొణిజర్ల, ఏప్రిల్12: కేంద్ర కార్పొరేట్ వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తనికెళ్లలో ఏర్పాటు చేసిన రైతుసంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్, కరువు కవల పిల్లలు

మధిర, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీ, కరువు రెండూ కవల పిల్లలని, రాష్ట్రంలో పంటలు నిలువునా ఎండిపోతున్నాయని,నష్టపరిహారం ఎకరాకు రూ.25వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శుక్రవారం మధిరలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావున గెలిపించాలని కోరారు.

ఆసుపత్రి కార్మికుల సమ్మెనోటీసు

మధిర, ఏప్రిల్ 12: మధిర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న 14మంది పేషెంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులకు గత 8నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. 18వతేదీలోపు వేతనాలు ఇవ్వకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కలిసి శుక్రవారం ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్‌కు సమ్మెనోటీసు అందజేశారు.

మద్దతివ్వాలని ఆదేశాలు ఏమీ లేవు..

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 12: టీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర పార్టీ ప్రకటన చేయలేదని, కొన్ని మండలాల్లో టీడీపీ నాయకులు టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్నట్లు గందరగోళాన్ని సృష్టిస్తున్నారని టీఎన్‌ఎస్‌యూసీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ వాసిరెడ్డి భాస్కరరావు అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకి మద్దతుగా ప్రకటనలు ఇవ్వడం సరైంది కాదన్నారు.

సర్కారుకు నై.. ప్రైవేటుకు జై...

(5వ పేజీ తరువాయి)

మార్కెట్లో రేట్లు పెరిగిపోతున్నాయి. క్వింటా బియ్యం రూ.6వేల నుంచి రూ 6500కు పైగా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం విదేశీ ఎగుమతులకు అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే బియ్యం ధరలు అమాంతం పెరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కల్లాల్లోనే క్వింటాకు రూ.3వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

రైతుకు ఆశించిన ధర లభిస్తోంది..
దొడ్డా శ్రీను, గుర్రాలపాడు

వరిసాగు తగ్గినప్పటికీ పండిన ధాన్యానికి మాత్రం బయట మార్కెట్లో మంచి ధర వస్తోంది. క్వింటాకు రూ.3వేలు పలుకుతోంది. ఇది రైతులకు ఆశించిన మేర ఉంటుంది కాబట్టి ప్రైవేటు వాళ్లకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరతో పోల్చితే రూ.800 నుంచి వెయ్యిరూపాయలు ఎక్కువగా వస్తున్నాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రాలకు తరలించే బాధకూడా తప్పుతోంది. తూకం, తరుగు కూడా లేదు. కల్లం నుంచి వ్యాపారులే తీసుకెళ్తుడడంతో రవాణా ఖర్చులు కూడా తగ్గుతున్నాయి.

మద్దతు ధర లభిస్తే ప్రయోజనమే..
డీఎస్వో చందన్‌కుమార్

రైతులకు మద్దతు ధర కన్నా అధిక ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే రైతులకు ప్రయోజనమే కదా. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉద్దేశ్యం కూడా అదే . ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధరను ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మద్దతు ధరకన్నా అధికంగా వస్తే అక్కడికే వెళ్తారు. జిల్లాలో మాత్రం ఇప్పటికే 157 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం.

రామయ్య ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ రూ.30

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ ధర రూ.30గా ఉండనుంది. కల్యాణమనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు దేవస్థానం ఆధ్వర్యంలో విక్రయిస్తుంటారు. గత ఏడాది ఇదేధరకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు విక్రయించారు. ఈసారి ముత్యాల ధర మార్కెట్లో పెరిగిన క్రమంలో ఒక ప్యాకెట్ ధర రూ.50 కి పెంచాలని దేవస్థానం అధికారులు నిర్ణయించి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు పంపారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్ ధర పెంచడానికి సాంకేతిక అవరోధాలు తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈసారి ఏప్రిల్, మే నెల వరకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ ధర రూ.30 వరకు ఉండే అవకాశం ఉంది. జూన్ లో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్యాకెట్ ధర రూ.50 అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

హోరెత్తిన ఎస్టీ మోర్చా ర్యాలీ

- పాల్గొన్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు, ఇతర నేతలు

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 12: బీజేపీ అనుబంధ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. గిరిజనులు డప్పు నృత్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియం నుంచి పార్టీ ఎన్నికల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన మోదీ ప్రతినిధిగా వినోద్‌రావు ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారని ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందన్నారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం నాయకులు సమావేశం నిర్వహించి, వినోద్‌రావు గెలుపునకు పనిచేయాలని నిర్ణయించారు. ప్రముఖ బంజారా గాయకుడు రాజు రాథోడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్‌లాల్, నాయకులు మోహన్, దొడ్డా అరుణ, భూక్యా శ్రీనునాయక్, శ్యామ్‌రాథోడ్ గుగులోత్ నాగేశ్వరరావు, ఉపేందర్, మోహన్ జాటోత్ మధు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ అభ్యర్థి 'నామా'ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు

పెనుబల్లి, ఏప్రిల్ 12: ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును మళ్లీ ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల సమావేశం శక్రవారం పెనుబల్లిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆ పార్టీ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు మంచి సాంప్రదాయ విలువలతో రాజకీయాలు చేస్తే నేడు అందుకు విరుద్ధంగా పరిపాలన సాగుతోందని, పరస్పరం గౌరవించుకునే పరిస్థితులకు భిన్నంగా రాజకీయాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ పథకంలో కూడా రాజకీయ వివక్ష చూపలేదన్నారు. ధాన్యం బస్తాపై రూ.500బోనస్‌ను ఎగొట్టేందుకే ధాన్యం కొనుగోలుపై సమీక్షల పేరుతో ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను ఇవ్వకుండా మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజలు ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, వైస్ ఎంపీపీ నరుకుళ్ల కస్తూరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావ్, నాయకులు షేక్.గౌస్, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, వంగా గిరిజాపతి రావు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి..

కల్లూరు: మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. కల్లూరులో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నామాతో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటవీరయ్య ప్రసంగించారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియపరుస్తూ ఓట్లు అడగాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 120 రోజులు గడిచినా నేటి వరకు హామీలను అమలు పరచలేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, మేకల కృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారికి పంచామృతాభిషేకం



శ్రీవారి పాదాన్ని అభిషేకిస్తున్న వ్యవస్థాపక ధర్మకర్త

ఎర్రుపాలెం, ఏప్రిల్ 12: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవ రాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నాల్గోరోజుకు చేరుకున్నాయి. తెల్లవారుజామునుంచే శ్రీవారికి సుప్రభాతసేవ, ప్రాతఃకాల అర్చనలు, సహస్రనామ అర్చనలు నిర్వహించారు. శ్రీవారు జమలాపురం సూచిగిరి కొండపై నుంచి ప్రస్తుత ఆలయమునకు వచ్చినట్లు సాక్షిభూతంగా ఉన్న శ్రీపాదానికి అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధరకాల పండ్ల రసాలతో మంత్రపూర్వక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. గోశాలలో గోపూజ అనంతరం శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదములతో పాటు ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు. కోలాట నృత్యాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారిని గజవాహనంపై గిరిప్రదక్షణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, వ్యవస్థాపక కుటుంబస భ్యులు ఉప్పల వెంకటజయదేవశర్మ, సూపరిడెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు విజయదేవశర్మ, రాజీవ్‌శర్మ, వేదపండితులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు నాగేశ్వరరావు కన్నుమూత

● నివాళులర్పించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే, మాజీ ఎమ్మెల్యే మెచ్చా



నాగేశ్వరరావు (ఫైల్)

దమ్మపేట, ఏప్రిల్ 12: ముష్టిబండ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత దొడ్డా చిన నాగేశ్వరావు (80) అనారోగ్యంతో శుక్రవారం మృతి కన్నుమూశారు. వర్జినీయ పొగాకు సాగులో ఉత్తమ రైతుగా నాగేశ్వరరావు డిల్లీలో అవార్డు అందుకున్నారు. నాగేశ్వరరావు మృతి చెందారని విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేరు వేరుగా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వివద పార్టీలకు చెందిన నాయకులు మాజీ సొసైటి అధ్యక్షులు రావు జోగేశ్వరరావు, రావు గంగాధరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కూకులకుంట సత్యనారాయణ, ఉడతనేని విశ్వేశ్వరరావు, దొడ్డా బాస్కరరావు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాల్వంచ, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పాల్వంచలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన సబావత్ నరేష్(20) స్థానికంగా వంట పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పాల్వంచలో పని ఉందని చెప్పి తన స్నేహితుడి ద్విచక్రవాహనం తీసుకుని పాల్వంచ వచ్చాడు. పని పూర్తి చేసుకుని తిరుగుప్రయాణంలో ఓ బ్యాంకు వద్ద అతి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతని చాతీకి బలమైన గాయాలవడంతో పాటు కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. స్థానికులు హుటాహుటిన అతనిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

మిర్చి చోరీకి విఫలయత్నం..

జూలూరుపాడు, ఏప్రిల్ 12: కల్లంలో ఆరబోసిన మిర్చిని ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేసిన దొంగను గ్రామస్థులు, రైతులు పట్టుకున్న సంఘటన గురువారం అర్ధరాత్రి మండలంలోని గుండెపూడి గ్రామంలో చోటుచేసుకుంది. గుండెపూడి గ్రామానికి చెందిన గాదె సత్యానారాయణ తన ఇంటి ఆవరణలో కల్లంలో 10 క్వింటాల మిర్చిని ఆరబోశాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పద్దం బుజ్జి కల్లంలో ఆరబోసిన మిర్చిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో సంబంధిత రైతు ఇంటి సమీపంలోని కొందరు గ్రామస్థులు, రైతులు చూసి దొంగను పట్టుకున్నారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

మత్స్య కళాశాలపై దృష్టి సారించరూ?

- 2022లో అప్పటి ప్రభుత్వం కళాశాల ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు
- స్థలం కేటాయించిన ప్రారంభకాని నిర్మాణాలు
- మరో మూడు నెలల్లో ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం
- మంత్రి పొంగులేటి దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

కూసుమంచి, ఏప్రిల్ 12: రాష్ట్రంలోనే పేరెన్నికలగల పాలేరు జలాశయానికి అనుసంధానంగా మత్స్యకళాశాల ఏర్పాటుచేయాలని గత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ల క్రితం కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపికచేసిన అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. కాని అమలు కాలేదు.

మరో మూడు నెలల్లో నూతన విద్యాసంవత్సరం ఆరంభానికి సమయం ఆసన్నమవడంతో మత్స్యకళాశాల ప్రతిపాదనలు ఈసారైనా అమలవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనువైనస్థలం అవసరమైన వసతులు తాత్కాలికంగా అందుబాటులో ఉన్నా.. కళాశాల ప్రారంభ అంశాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడవేసినగొంగళి అక్కడే అన్నచందంగా తయారయింది.

తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఖమ్మంజిల్లాలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈక్రమంలో పాలేరు మత్స్యపరిశోధనాకేంద్రం పరిధిలో ఏర్పాటుచేస్తు గత 2022 సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కళాశాల ఏర్పాటుకోసం ప్రయత్నాలు జరుగుతుండగా, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో కళాశాలను మంజూరీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 20 సీట్లు కేటాయించారు. 10 తరగతి అనంతరం పాలీసెట్ ద్వారా సీట్లను భర్తీచేస్తామని ప్రకటించారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బావుదేవరపల్లిలో మాత్రమే మత్స్య కళాశాల ఉంది. ఇక్కడి విద్యార్థులు అక్కడ విద్యనభ్యసించేవారు. మత్స్యకళాశాల పాలేరుకు మంజూరుకావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

10 ఎకరాల స్థలం కేటాయింపు

జిల్లాకు మత్స్య పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకావడంతో ఉన్నతాధికారులు స్థలసేకరణ చేశారు. కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామంలో 356 సర్వేనెంబరులో సుమారు 12 ఎకరాలు ఎన్నెస్పీ స్థలం ఉండగా కొంతకబ్జాకు గురవగా, మిగిలిన 10ఎకరాలు భూమిని గుర్తించారు. ఉన్నత అధికారుల బృందం స్థలాన్ని పరిశీలించి, అనువుగా ఉండటంతో వెంటనే మత్స్యశాఖకు అప్పగించారు.

ఎక్కడవేసిన గొంగళి అక్కడే

పాలేరుకు మత్స్య పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వం కేటాయించడం, స్థలాన్ని పరిశీలించడం, అనువుగా ఉండటంతో 10ఎకరాల ఎన్నెస్పీ స్థలాన్ని మత్స్యశాఖకు కేటాయించడం వెంటవెంటనే జరిగిపోయాయి. అదేవిధంగా భవనాల నిర్మాణం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇతరత్రా సుమారు రూ.32కోట్ల అంచనాలతో ఫిషరీస్ అధికారులు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఈవిద్యాసంవత్సరమే క్లాసులు ప్రారంభించుకునేవిధంగా అవసరమైన వసతులు ఉన్నాయంటూ నివేదించారు. ప్రతిపాదిత స్థలానికి దగ్గరలో కూసుమంచిలో రెవెన్యూ అకాడమీ, పాలేరులో మత్స్యపరిశోధనాకేంద్రంలో వసతులు ఉన్నాయిని నివేదించారు. కానీ ఇప్పటివరకు ఆర్థికశాఖ క్లియరెన్స్‌గానీ ఏమీ రాలేదని ఫిషరీస్ అధికారులు తెలిపారు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లయింది. కళాశాల మంజూరు చేసి సుమారు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ నేటివరకు ఏర్పాట్లు ముందుకు సాగకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

స్థానిక పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. రాష్ట్ర కేబినేట్‌లో కీలకంగానే ఉన్నందున వెంటనే పట్టించుకుని కళాశాల ప్రారంభానికి కృషి చేయాలని కోరుతున్నారు. వచ్చే 2024-25 విద్యాసంవత్సరం నుంచే ఇక్కడి విద్యార్థులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కళాశాల ఏర్పాటుగురించి పట్టించుకోవాలని కోరుతున్నారు.



పాలేరు మత్స్యపరిశోధనాస్థానం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

డాక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎఫ్ఆర్‌వో పాలేరు

పాలేరులో మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు అవసరమయ్యే ఆర్థిక, వనరులపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మత్స్య కళాశాలకు అవసరమయ్యే రెగ్యులర్ పోస్టులు, భవనాలు, ల్యాబ్‌లు, హాస్టల్, అకడమిక్ బిల్డింగ్స్, అవసరమయ్యే బడ్జెట్ తదితర అంశాలపై ప్రభుత్వానికి మంజూరీ కోరుతూ ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి నివేదించాం. ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తూ జీవో రావాల్సి ఉంది. రాగానే కళాశాల ఏర్పాటు పనులు చేపడతాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం అయ్యేలా కృషి చేస్తున్నాం.

తపాలా బీమా ఏజెంట్లుగా అవకాశం

● పోస్టల్ ఎస్పీ రవికుమార్

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 12: పోస్ట్ ఆఫీస్ బీమా పథకాలైన తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలాజీవిత బీమాలకు సంబంధించి ఏజెంట్లను కమీషన్ పద్ధతిలో తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోన్నట్లు తపాలా సూపరిన్‌టెండెంట్ బి రవికుమార్ తెలిపారు. పదో తరగతి పూర్తి చేసి 18 ఏళ్ల నిండిన నిరుద్యోగులు, అంగన్ వాడీ సేవకులు, మహిళా మండల సేవకులు, మాజీ సైనిక ఉద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామీణతపాలా సేవకులు అర్హులు అని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 6 సాయంత్రం ఐదు గంటల లోపు పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంకు చేరేలా దరఖాస్తులను 10వ తరగతి మెమో, పాన్‌కార్డు, ఆధార్ కార్డ్ కాపీలను జత చేసి పంపించాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులు 5వేల విలువైన జాతీయ సేవింగ్ సర్టిఫీకెట్లు, లేదా కిసాన్ వికాస పత్రాల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు దగ్గర్లోని ఏదైనాతపాలా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రేపు పాల్వంచలో అథ్లెటిక్స్ ఎంపికలు

పాల్వంచ, ఏప్రిల్ 12: పాల్వంచ శ్రీనివాసకాలనీ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఆదివారం జిల్లా మిడిల్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు 14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల బాలికలకు, స్త్రీ, పురుషులకు పరుగు పందెం అంశాలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 28న సూర్యాపేటలో జరుగనున్న రాష్ట్ర పోటీలకు పంపుతామని తెలిపారు.

అవకాశవాద కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

- గెలిపించి తప్పుచేశామని ప్రజలు బాధపడుతున్నారు..
- మానుకోటలో మాలోతు కవితను మరోసారి గెలిపించాలి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తాతా మధు



అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీని నమ్మి మళ్లీ ఓటేస్తే రాష్ట్రం అధోగతిపాలవుతుందని ఎంపీ మాలోతు కవిత, ఎంఎల్‌సీ తాతా మధు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌లు విమర్శించారు. గంగోలు వీవీఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎక్కువ సీట్లిచ్చి గెలిపిస్తేనే రాష్ట్రంలో సంక్షేమం అమలౌతుందనే అవకాశవాద కాంగ్రెస్ పార్టీకు ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. పాలన వందరోజులు దాటినా ఎన్నికల హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన సామాజిక భద్రత పింఛను రూ.4వేలకు పెంపు, రైతు భరోసా, వ్యవసాయ రుణమాఫీ, యువ వికాసం, చేయూత, మహిళలకు రూ.2500ల ఆర్థికసాయం, వివాహం చేసుకున్న వారికి తులం బంగారం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బస్సులో ఉచిత ప్రయాణం కాదు రూ.2500ల ఆర్థికసాయం ఎప్పుడిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారన్నారు. కేసీఆర్‌ను ఓడగొట్టి కాంగ్రెస్‌ను గెలిపించి తప్పుచేశామని తెలంగాణా ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కోటి ఎకరాలకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌ది కాగా, రైతు కష్టం తెలియని మూర్ఖుడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఎంపీ కవిత పార్లమెంటులో పోరాడి తెలంగాణాకు గిరిజన యూనివర్సిటీ సాధించారని తెలిపారు. మహబూబాద్ ఎంపీ స్థానానికి పోటీపడే అభ్యర్థుల్లో ఒకరు బీఆర్ఎస్ నుంచి వెళ్లిన వారని, మరొకరు ఎక్కడుంటారో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. గిరిజనుల సమస్యలపై పార్లమెంటులో పోరాడే కవితను గెలిపించాలని కోరారు. నాతో పోటీ పడే ఇద్దరు అభ్యర్థులు ఔట్ డేటెడ్, ఎక్స్‌పైరీ డేటెడ్ అభ్యర్థులని ఎంపీ కవిత విమర్శించారు. తమ స్వలాభం కోసం గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపి రైతుల నోర్లు కొట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎంపీ ఆరోపించారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కటం ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, అన్నె సత్యనారాయణ, సాగి వాసురాజు, ఎంపీపీ లక్ష్మి, చర్ల, భద్రాచలం మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకట్రావ్‌కు నియోజకవర్గ ఎల్లలు తెలుసా: మధు

నీకు నియోజకవర్గ ఎల్లలు తెలుసా.. నియోజకవర్గం గురించి ఏమి తెలుసు.. భద్రాచలం వస్తే తన దుస్తులు విప్పదీస్తానని పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన ఎమ్మెల్యే వెంకట్రావుకు దమ్ముంటే ఇక్కడకు రావాలని ఎమ్మెల్సీ తాతా మధు సవాల్ విసిరారు. ఆయన గ్రామానికి కూతవేటు దూరంలోనే సమావేశం నిర్వహిస్తున్నా.. వెంకట్రావు ఇక్కడకు వచ్చి మాట్లాడాలన్నారు. నువ్వు ఎందుకెళ్లావు.. ఎవరు తీసుకెళ్లారు.. ఏ స్వార్థంతో వెళ్లావో నీ ఆత్మసాక్షికు తెలుసన్నారు. ఆయన స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీకు వెళ్లి, గెలిపించిన కార్యకర్తలను కష్టపెట్టాడన్నారు. ప్రజలు చీత్కరించే స్థితికి దిగజారవద్దని ఎమ్మెల్యే వెంకట్రావుకు హితవు పలికారు.

నిశ్చితార్థ వేడుకల్లో అపశృతి

● గ్యాస్ లీకై మంటలు

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 12: ఇల్లెందు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల దాసరిగడ్డలో శుక్రవారం వివాహనిశ్చితార్థ వేడుకలో అపశృతి చోటుచేసుకుంది. దాసరిగడ్డకు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో వివాహ నిశ్చితార్థ వేడుకల సందర్భంగా వంటలు చేస్తుండగా అకస్మాతుగా గ్యాస్ లీకై మం టలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన తరలివచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులో కి తీసుకొచ్చారు. అయితే మంటలను ఆర్పేక్రమంలో వివాహ నిశ్చితార్థ వేడుకలకు వచ్చిన బంధువుకు స్వల్పగాయాలయ్యాయి.

అనాథ శవానికి
దహన సంస్కారాలు

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 12: పట్టణంలో హోటల్‌లో పని చేస్తు జీవనం సాగించే అనాధ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందడంతో కొంతమంది హోటల్ యజమానులు స్పందించి సొంతఖర్చులతో అనాధశవానికి దహన సంస్కా రాలు చేపట్టారు. పట్టణంలోని నెం:2బస్తీ సీతారామ థియేటర్ సమీపంలో నివాసం ఉండే లిమ్మ (55) తమిళ నాడుకు చెందిన వ్యక్తి. గత కొంతకాలంగా పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం హోటల్‌లో పనికి వచ్చి ఇంటికి వెళ్లిన వ్యక్తి అకస్మాతుగా అనారోగ్యానికి గురై ఇంట్లో మృతి చెందాడు. ఇల్లెందులో ఆయన తరపున బంధువులు కానీ సొంత గ్రామం తమిళనాడులో కూడా ఎవరు లేకపోవడంతో స్పందించిన హోటల్ యజమానులు మహేష్, సురేష్‌లు తమ సొంత ఖర్చులతో దహనసంస్కారాలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఆగని గ్యాస్ దందా?

- గ్రామాల్లో వాస్తవ ధరకు మించి లబ్ధిదారుల నుంచి అధికంగా వసూళు
- గ్యాస్ అసలు ధర రూ.840
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



రఘునాథపాలెం, ఏప్రిల్ 12: ఖమ్మం జిల్లా కేంద్రానికి అనుబంధంగా అర్బన్ ప్రాంతంలో కలిసి ఉన్న రఘునాథపాలెం మండలంలో గ్యాస్ సిలిండర్ దందాలకు అధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, ఏజెన్సీ సంఘాల నాయకులు మండలానికి గ్యాస్ డీలర్లకు వ్యవహరించటంతో ఎన్ని ఫిర్యాదులు అధికా రులకు అందినా అవి బుట్టదాఖలైతున్నా యని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరం నుంచి రఘునా థపాలెం మండలానికి పంపిణీ జరిగే గ్యాస్ కంపెనీల్లో రెండు కంపెనీల గ్యాస్ డీలర్లు రూ.980, రూ.900 వరకు వసూళ్లు చేస్తున్నారు. రైతులు, కూలీలు అనే కనీస ఆలోచన లేకుండా గ్రామీణా ప్రాంతాల్లో అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. వాస్తవానికి ఒక్కో గ్యాస్ సిలిండర్‌ను రూ.840 డెలివరి చార్జీలతో కలుపుకోని లబ్ధిదారుల ఇంటి ముందుకు చేరాల్సి ఉంటుంది.

వాహనాలపై ధరల చూచిక బోర్డులకు డిమాండ్

ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు గ్యాస్ ఏజెన్సీలు లబ్దిదారులకు సిలిండర్లను పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే అధికంగా డబ్బులు గ్యాస్ ఏజెన్సీలు వసూళ్లు చేయటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ధరలు ప్రజలకు తెలియటం లేదు. పైగా గ్యాస్ పుస్తకంపై ఎన్ని డబ్బులు తీసుకుంటున్నామని కానీ రసీదులను కూడా గ్యాస్ ఏజెన్సీలు పాస్ పుస్తకాలపై నమోదు చేయటం లేదు. దీంతో లబ్ధిదారులు గ్యాస్ ధరలపై అయోమయానికి గురైతున్నారు. గ్యాస్ పంపిణీ చేసే వాహనాలపై గ్యాస్ సిలేండర్ ధరల బోర్డులను ఏర్పాటు చేయటం ద్వారా మాత్ర మే గ్యాస్ ఏజెన్సీల దందాలను అరికట్టొచ్చని లబ్ధిదారులు కోరుతున్నారు.

కుల బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 12: తమను కులంనుంచి బహిష్కరించారని ఆరోపిస్తూ ఓ బాదితుడు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని నాయుడుపేటకు చెందిన చప్పిడి బంగారి అనే అతడిని, తన సోదరులను తమ కులస్థులు ఎవరితోనూ మాట్లాడకుండా కట్టడి చేస్తున్నారని, కులం నుంచి బహిష్కరిస్తున్నారని ఎవరు తమతో మాట్లాడటం లేదని పేర్కొన్నారు. తమ కుటుంబంలో జరిగిన విషయంపై పంచాయితీలో మాట్లాడాలని కుల పెద్దలు పిలిస్తే వెల్లకపోవడంతో కులం నుంచి బహిష్కరిం చారని తెలిపారు. బంగారి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

'దళితబంధు' ఇప్పిస్తానని డబ్బులు వసూళ్లు

- రాకపోవడంతో నాయకుడి ఇంటి ఎదుట ఆందోళనకు బాధితుల యత్నం

కారేపల్లి ఏప్రిల్ 12: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో గతంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు దళితబంధు పథకం ఇప్పిస్తా నని ఒక్కొక్కరినుంచి సుమారు రూ.2లక్షల చొప్పున ఆరుగురి వద్ద వసూళు చేసి పథకం రాకపోవడంతో బాధితులు ఆ నాయకుడి ఇంటి ఎదుట ఆందోళనకు ప్రయత్నించిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మండల నాయకుడు తనకున్న పలుకుబడితో దళితబంధు పథకం ఇప్పిస్తానని పలువురు బాధితుల వద్ద రూ.2లక్షల చొప్పున వసూళు చేశారు. అయితే దళితబంధు పథకం బాధితులకు రాకపోవడంతో వారు అనేక సార్లు ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని బాధితులు ఆ నాయకుడిని అడిగారు. అయితే అడిగిన ప్రతీసారి దాటవేస్తూ వచ్చాడని బాధితులు ఆరోపిస్తున్నారు. పథకం వస్తుందని మా జీవితాలు బాగుపడతాయని అప్పులు చేసి ఆ నాయకుడికి డబ్బులు ముట్టజెప్పినట్టు బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తెచ్చిన డబ్బులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, దళితబంధు పథకం రాకోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొటున్నామని వారు వాపోతున్నారు. అయితే ఆ నాయకుడు ప్రస్తుతం అధికార పార్టీలో చేరారన్నారు. అయితే డబ్బులు ఇచ్చిన కొందరు తమ డబ్బులు తిరిగిచెల్లించాలని, లేకుంటే ఇంటిఎదుట ఆందోళన చేసేందకు ప్రయత్నం చేసేందకు ప్రయత్నం చేస్తుండగా గ్రామంలోని కొంద రు పెద్దమనుషులు జోక్యం చేసుకొని ఇరువర్గాలకు సంబంధించిన వారితో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన ప్రయత్నం విరమించినట్లు తెలిసింది.

వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం

- పోలీసుల విచారణ

నేలకొండపల్లి, ఏప్రిల్ 12: మండల పరిధిలోని నాచేపల్లి గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో శుక్రవారం ఓ మృతదేహాన్ని కనుగొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. వివరాలు ఇలా.. నాచేపల్లికి చెందిన సట్టు నాగరాజు(28), పరిమి గోపి మూడు రోజుల క్రితం మద్యం సేవించి బావిలో ఈతకు వెళ్లినట్లు సమాచారం. గోపి తిరిగి వచ్చాడు కానీ, నాగరాజు మాత్రం తిరిగి రాలేదు. ఇదిలా ఉండగా మూడు రోజులుగా గోపి నాగరాజు వచ్చాడా అంటూ నాగరాజు ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్నట్లు తెలుస్తున్న ది. శుక్రవారం సైతం గోపి నాగరాజు ఇంటికి వెళ్లి అడగ్గా ఎక్కడున్నాడో చూసిరా..అంటూ నాగరాజు కుటుంబ సభ్యులు చెప్పగా గోపి బావుల్లో వెతుకుతుండగా ఓ వ్యవసాయ బావిలో నాగరాజు మృతదేహం కనపడటంతో విషయం గ్రామస్థులకు తెలపగా, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం దాదాపు కుళ్ళిపోయిన స్థితిలో ఉంది. మృతునికి ఈత వచ్చినా..మద్యం మత్తులో ఈత కొట్టలేక పోయాడేమోనని గ్రామస్థులు చెపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి తరలించి పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో గోపి పేరు బయటకు రావటంతో గోపిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదివాసీల దాహార్తి తీర్చుతున్న
సోలార్ వాటర్ ట్యాంకులు

- రోజుకు 10వేల లీటర్ల నీటిసరఫరా

అశ్వాపురం ఏప్రిల్ 12: మండు వేసవిలో గుక్కెడు నీళ్లు దొరకటమే కష్టమైన తరుణంలో మారుమూల ఆదివాసీల గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ ట్యాంకులు వారి దాహార్తిని తీర్చుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు సైతం ఎండిపోతున్న తరుణంలో సోలార్ వాటర్ ట్యాంకులే కల్పతరువుగా మారాయి. మిషన్ భగీరథ పైపులైన్ వేయటానికి వీలులేని గ్రామాల్లో రూరల్ వర్క్స్ స్కీం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో సోలార్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వేములూరు, మనుబోతులగూడెం, రాయనపేట, కుమ్మరిగూడెం ఆదివాసీ గ్రామాల్లో అధికారులు సోలార్ వాటర్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఆయాగ్రామాల్లో సుమారు 100 కుటుంబాలు నివసిస్తుండగా 5వేల లీటర్ల సామర్థ్యంతో బోరు సహయంతో ట్యాంకులను ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు రెండు సార్లు ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నారు.

ట్యాంకుల పనితీరును పరిశీలించిన సుల్తానియా

కాగా మండు వేసవిలో మిషన్ భగీరథ ఇన్‌టెక్ వెల్ వద్ధ గోదావరి జలాలు అడుగంటుతున్న విషయం తెలుసుకుని పరిశీలనకు ఈనెల 8న వచ్చిన పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సోలార్ వాటర్ ట్యాంకుల పనితీరును పరిశీలించారు. ఆదివాసీలతో మాట్లాడి తాగునీరు అందుతున్న తీ రుని తెలుసుకుని వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.





సోలార్ వాటర్‌ట్యాంకు, గిరిజనులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సుల్తానియా, కలెక్టర్ ప్రియాంక

ఆటోమొబైల్ షాపులో అగ్ని ప్రమాదం..

రూ.20 లక్షల ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


పాల్వంచ, ఏప్రిల్ 12: పాల్వంచ పట్టణ పరిధిలోని అంబేద్కర్ సెంటర్లోని ఓ ఆటోమొబైల్ షాపులో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.20లక్షల ఆస్తి అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తుంది. స్థానికుల కథనం ప్రకారం అంబేద్కర్ సెంటర్లోని ఓ ఆటమొబైల్ షాపులో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ఏర్పడి రాత్రి సమయంలో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. గమనించిన షాపు యాజమాన్యం, స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. షాపులోని అన్ని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ముందస్తు చర్యల్లో బాగంగా మంటలు ఇతర వ్యాపార సముదాయాలకు వ్యాపించకుండా మంటలను అదులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.20లక్షల నుంచి 30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని షాపు యజమాని వెంకట్ తెలిపారు.

4 ఎకరాల్లో పామాయిల్ తోట దగ్ధం

కొణిజర్ల: మండల పరిధిలోని కొండవనమాల గ్రామంలో నాలుగు ఎకరాల్లో పామాయిల్ మొక్కలు దగ్ధమైన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన విజయలక్ష్మీ ఏడు ఎకరాల్లో పామాయిల్ తోటను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం తోటలో అకస్మాత్తుగా మంటలు చేచాయని సుమారు 4ఎకరాల్లో 250 మొక్కలు వరకు దగ్దమై రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిన్నట్లు బాధితులు తెలిపారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12: అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేసిన సంఘటన రూరల్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిదిలోని మద్దులపల్లి, కాచిరాజుగూడెం గ్రామాల పరిధిలో ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తోలకాలు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక యువకులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అనుమతులు లేకుండా తోలకాలు నిర్వహిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు టిప్పర్లను సీజ్ చేసి మైనింగ్‌అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.



కొత్త వ్యక్తులకు గ్రామంలో ఆశ్రయం ఇవ్వొద్దు: సీఐ

మణుగూరు, ఏప్రిల్ 12: తమ గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం కల్పించాలని అడిగితే అట్టి వారికి ఆశ్రయం కల్పించవద్దని మణుగూరు సీఐ సతీష్ కుమార్ మండలంలోని వలస ఆదివాసీ గిరిజనులకు సూచించారు. మండల పరిధి లోని పగిడేరు పంచాయతీ శివారు అటవీ ప్రాంతంలో ఉన్న విప్పల గుంపు వలస ఆదివాసీ గ్రామంలో మణుగూరు సీఐ సతీష్ కుమార్ తమ సిబ్బందితో శుక్రవారం పర్యటించారు. గత నెల రోజులుగా ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న మావోల కార్య కలాపాలను దృష్టిలో పెట్టుకుని మణుగూరు ఏరియాలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఈ మేరకు చర్యలను చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్థులతో సమావేశాలను నిర్వహించి మాట్లాడారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పిస్తే అట్టివారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలను తీసుకోవడం జరుగుతుందని గ్రామస్థులకు తెలిపారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.

'కమలాపురం'ను పట్టించుకోరా..?

ప్రమాదభరితంగా ప్రధాన రహదారి

కనీస మరమ్మతులు కరువు..

ప్రధాన కాలువల ఏర్పాటులో కాలం వెల్లదీత

మణుగూరు, ఏప్రిల్ 12: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. ప్రధానంగా ఈ గ్రామంలోని ప్రధాన రహదారి సమస్య తీవ్రంగా ఉంది. అడుగడుగునా గుంతల మయంగా మారింది. దీంతో ద్వి చక్రవానాలు సైతం నడిపించలేని దుస్థితి నెలకొంది. కట్టు మల్లారం బ్రిడ్జి వరకు బీటీ రోడ్ పనులు చేపట్టారు కానీ ఆ తర్వాత అక్కడి నుంచి కమలాపురం నుంచి రాయగూడెం అనంతారం క్రాస్ రోడ్డు వరకు ఉన్న రోడ్డును ఏర్పాటు చేయడం అధికారులు ప్రజా ప్రతినిధులు మరిచారంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మణుగూరు నుంచి మండల శివారున ఉన్న రావిగూడెం వరకు ఉన్న ప్రదాన రహాదారి ఈ గ్రామంలో ఇంత అధ్వాన్నంగా ఉంటడంతో నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు జరిపే ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తీవ్ర స్థాయిలో దెబ్బతింటున్నాయని వాహన చోదకులు పేర్కొంటున్నారు. కనీస మరమ్మతులు కూడా చేసేందుకు ఎవరూ ముందుకు రాక పోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. ప్రదాన రహాదారికి ఇరువైపులా కనీసం కచ్చాకాలువలు కూడా ఓ క్రమ పద్ధతిలో లేకపోవడం రోడ్లపైకి నీరు చేరి పడ్డ గుంటల్లో నిరు నిలిచి బురదమయం చేస్తున్నాయి.

ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్డు

అనంతారం ఇసుక ర్యాంపు నుంచి ఇసుక లారీల రాకపోకల వల్ల రేండేళ్ల క్రితం వేసిన రోడ్డు నామ రూపాలు లేకుండా పోయింది. గుంతల మయంగా మారిన రోడ్డుపై ఇంకా లారీలు రాకపోకలు సాగించడంతో పరిస్థితి ప్రమాద భరితంగా మారింది. మణుగూరునుంచి కమలాపురం మీదుగా ఉన్న రోడ్డంతా సింగిల్ రోడ్ కావడంతో ఓ లారీ వస్తే ఇతర ఏ వాహనానికైనా వెళ్లే మార్గం లేకుండా పోతోంది. దీంతో తరచూ కమలాపురం కట్టు మల్లారం, పూజారి నగర్ ప్రాంతాల్లో వాహన చోదకులు, లారీ డ్రైవర్లకు మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

మా రోడ్డు బాగుపడేదెప్పుడో..?

ఏళ్లకు ఏళ్లు గడుస్తున్నాయి. ఎప్పుడు మట్టి దిబ్బగానో... గుంతల మయంగానో ఉంటడం తప్ప మా గ్రామంలోని మెయిన్ రోడ్డు బాగుపడిన పరిస్థితులు లేవు. రోడ్లపై నడవాలన్నా కష్టంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది అంటూ గ్రామస్థులు రమణయ్య, రాజు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రాము, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి ప్రధాన రహదారిని, రోడ్డుకు ఇరువైపులా కాలువలను ఏర్పాటు చేస్తే కాస్త రాకపోకల సౌకర్యాన్ని కల్పించిన వారు అవుతారంటూ వేడుకుంటున్నారు.



కమలాపురం ప్రధాన రహదారి



రహదారిపై గుంతల్లో మురుగునీరు

ఎక్కడా నీటి సమస్య ఉండకూడదు

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 12: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో మంచి నీటి సమస్య ఉండకూడదని, సమస్య పరిష్కరించేందుకు ప్రత్యే నిధులు మంజూరు చేయటం జరిగిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మండలంలోని ఒడ్డు రంగాపురం, వాగొడ్డుగూడెం, గుమ్మడవల్లి, నారాయణపురం, మల్లాయిగూడెం, గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించి పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు మంచి నీటిసమస్య ఎక్కడైన వుంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ప్రత్యేక నిధులు మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మాజీ ఎంఎల్ఏకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: భద్రాచలం మాజీ ఎంఎల్ఏ కుంజా బొజ్జికి సీపీఎం మండల నాయకులు ములకపాడు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. నిజాయతీ, నిస్వార్థానికి మారుపేరైన బొజ్జి స్ఫూర్తితో ఉద్యమించాలని మండల కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. నాయకులు మర్మం చంద్రయ్య, వైశ్రీనివాసు, తెల్లం ధర్మయ్య, బైరెడ్డి సతీష్, మహేంద్రనాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఎంపీ గెలుపునకు కృషిచేయండి

ఇల్లెందు కాంగ్రెస్ నాయకులకు మంత్రి తుమ్మల సూచన

దమ్మపేట/ ఇల్లెందు, ఏప్రిల్ 12: మహబూబాద్ కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి బలరామ్ నాయక్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని ఇల్లెందు కాం గ్రెస్ నాయకులకు వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. తుమ్మలను ఆయన నివాసంలో ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతు మహబూబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్‌కు అత్యధిక మెజారిటితో గెలిపించేందుకు కృషి చేయాలని, అభ్యర్థికి ఇల్లెందు నియోజక వర్గంలో అత్యధిక మెజారిటి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ ఐక్యంగా గెలుపునకు కృషి చేయాలన్నారు. ఏవైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇల్లెందు నియోజక వర్గానికి ఎల్‌డబ్ల్యుఈ నిధుల ద్వారా అభివృద్ధికి కృషి చేస్తున్న తుమ్మలకు ఈ సందర్భంగా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నుంచి ఇల్లెందుకు నాలుగు వరుసల రహదారి నిర్మించాలని తుమ్మలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులను చర్చించారు. తుమ్మలను కలిసిన వారిలో కనగాల పేరయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ, చేతుల శ్రీనివాస్, ప్రభునాథ్ యాదవ్, రాజేందర్ తదితరులున్నారు.



మంత్రి తుమ్మలతో ఇల్లెందు నాయకులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు జర్నలిస్టుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

ఇల్లెందు, ఏప్రిల్ 12: జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఇల్లెందు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కనకయ్యను కలిసి ఇళ్ల స్థలాల సమస్యపై చర్చించారు. తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు గుర్రం రాజేష్, మాదాసు నర్సి, దేవిరెడ్డి, సుమంత్, రమణ, మధు, ముత్యం, కృష్ణ, బత్తుల రాధాకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

పాల్వంచలో నేడు తాగునీటి సరఫరా బంద్

పాల్వంచ, ఏప్రిల్ 12: పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలో శనివారం తాగునీటి సరఫరా బంద్ చేయనున్నట్లు పాల్వంచ మునిసిపల్ కమిషనర్ స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని పున్నమ్మ కాంప్లెక్స్, కరకవాగు ప్రాంతాల్లో మెయిన్ పైప్‌లైన్ మరమత్తుల కారణంగా నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అశ్వారావుపేట/దమ్మపేట, ఏప్రిల్: అశ్వారావుపేట 33 కేవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఏడీఈ బి.వెంకటేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట సబ్‌స్టేషన్ పరిదిలో గల గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దమ్మపేటలో..

మందలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు శనివారం నిర్వహిస్తున్నట్లు ఏఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మందలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిలిపివేయటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ పాల్వంచ పట్టణ కమిటీ విస్తరణ

పాల్వంచ, ఏప్రిల్ 12: పాల్వంచ పట్టణ కమిటీని బీజేపీ విస్తరణ చేసింది. శుక్రవారం కొత్తగూడెం బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్‌లు కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పగిడిపాటి రవీందర్, బైరి నిర్మల, గొడుగు శ్రీధర్, బట్టు శివ తదితరులు పాల్గొన్నారు.

'నాపై ఆరోపణలు అవాస్తవం'

అశ్వాపురం, ఏప్రిల్ 12: తాను మొండికుంట సర్పంచ్‌గా, నెల్లిపాక సింగిల్ విండో ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో అవినీతికి పాల్పడ్డానంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మొండికుంటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సొసైటీ అభివృద్ధికి కూడా తన వంతు కృషిచేశానన్నారు. తాను పాలక వర్గాల తీర్మానం మేరకే పంచాయతీలో పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలే తప్ప నిరాధార ఆరోపణలు చేయటం తగదన్నారు.

సీతారాముల కల్యాణ పనులు ప్రారంభం

అశ్వారావుపేట, ఏప్రిల్ 12: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో గల రామాలయంలో ఈనెల 17న జరగనున్న సీతారాముల కల్యాణ ఏర్పాట్లను శుక్రవారం ఆలయకమిటి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పూజలు నిర్వహంచి అక్షింతలు కలిపే కార్యక్రమం నిర్వహించారు.

రామయ్యను సందర్శించిన దేవనాథ జీయర్ స్వామి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రామయ్యను దేవనాథ రామానుజ జీయర్‌స్వామి శుక్రవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్ఠతను గురించి ఆయనకు విశేషంగా వివరించారు. ప్రత్యేక అధికారి అనీల్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అధ్యక్షుడు ఎల్లారెడ్డి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: దుమ్ముగూడెం ప్రాథమిక సహకార సంఘ సభ్యురాలు మండలోజు ఝాన్సీరాణి కుటుంబ సభ్యులకు సొసైటీ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి శుక్రవారం రూ.లక్ష బీమా చెక్కును అందజేశారు. ఐదు నెలల క్రితం ఝాన్సీరాణి ప్రమాదవశాత్తూ మృతిచెందడంతో బీమా నగదు మంజూరైంది. డీసీసీ బ్రాంచి మేనేజరు నర్సింహారావు, సంఘం కార్యదర్శి ముత్తయ్య, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

ఏడూళ్ల బయ్యారం సీఐ కరుణాకర్.. ఆదివాసీలకు కౌన్సెలింగ్

పినపాక, మార్చి 12 : సమాజ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని ఏడూళ్లబయ్యారం సీఐ టి కరుణాకర్, ఎస్ఐ వెంకటప్పయ్య లు సూచించారు. శుక్రవారం మండలంలోని గోపాలరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలను ఏడూళ్లబయ్యారం పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా వలస ఆదివాసీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సంఘవిద్రోహ శక్తులకు సహకరించి జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. ఆదివాసీల అభివృద్ధికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, అపరిచితులు సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలేమైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని, వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుని ఓటును వినియోగించుకోవాలన్నారు. అపరిచితులు ఎవరికీ ఆశ్రయం కల్పించవద్దని కోరారు. అనుమానితులు ఎవ్వరైనా తారసపడితే పోలీసులకు సమచారం ఇవ్వాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ కౌన్సిలింగ్‌కు విశేష స్పందన లభించిందని ఎస్ఐ వెంకటప్పయ్య అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలరావుపేట గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

సీపీఐలో చేరిన నలుగురు కౌన్సిలర్లు

కొత్తగూడెం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు సీపీఐలో చేరారు. శుక్రవారం శేషగిరిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మాచర్ల రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, సత్యానారాయణ చారి, నేరళ్ల సమైఖ్యకు కండువాలు కప్పి ఆహ్వానించారు. గత ఎన్నికల ముందు సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో నలుగురు కౌన్సిలర్లతోపాటు పలువురు తాజా, మాజీ సర్పంచులు తిరిగి మాతృసంస్థ సీపీఐ పార్టీలో చేరగా మరో కౌన్సిలర్ వై. శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చే బాధ్యత కమ్యూనిస్టు పార్టీపై ఉందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడంతోపాటు సీపీఐని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, నాయకులు శ్రీనివాస్, వెంకన్న, శ్రీనివాస్, ఎల్లయ్య, మురళీ, దస్రు, జమలయ్య, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్లు, జక్కుల రాములు, గోవిందు, ధనలక్ష్మి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐలో చేరిన వారితో ఎమ్మెల్యే కూనంనేని

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఆళ్లపల్లి. ఏప్రిల్ 12: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని ముత్తాపురం గ్రామానికి చెందిన గుంపిడి ఎర్రయ్య ద్విచక్రవాహనంపై ఆళ్లపల్లి నుండి చింతోనిగుంపులోని అటవీశాఖ కార్యాలయంకు వెలుతుండగా, అదే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ఎర్రయ్య తల, భుజం, కన్నుకు తీవ్ర గాయాలు కాగా, అటవీశాఖ అధికారులు చూసి వారిని ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన ద్విచక్రవాహనదారులు ఎవరు అనేది ఇంకా తెలియలేదు. ఈ సంఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదు.

'పాయం'కు రైతుల వినతి

మణుగూరుటౌన్/కరకగూడెం, ఏప్రిల్ 12: కరకగూడెం మండలంలోని పులుసుబొంత ప్రాజెక్ట్‌కు సంబంధించి రైతులు ఎవరు నష్టపోకుండా రీ సర్వే చేయించాలని కోరుతూ.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రైతులు వినతి పత్రమందజేశారు. శుక్రవారం మణుగూరు ప్రజాభవన్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో రైతులు ఈ మేరకు వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. ప్రాజెక్ట్ రీ సర్వే చేయాలని, తద్వారా ఏ రైతుకు నష్ట వాటిల్లకుండ చూడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు గొగ్గలి రవి, రామకృష్ణ, కార్యకర్తలు, రైతులు, మణుగూరు నాయకులు కూచిపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

జూలూరుపాడు, ఏప్రిల్ 12 : మండలంలోని పడమట నర్సాపురంలో గల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్‌కాలనికి చెందిన తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులను అందచేశారు. 60 మంది విద్యార్థినులకు ఆ సంఘం అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్‌కుమార్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగేశ్వరరావు, ధర్మారావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గూడెం'లో మంత్రి పొంగులేటి పర్యటన

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 12: రెవెన్యూ, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం కొత్తగూడెం పట్టణంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సాయంత్రం కొత్తగూడెం పట్టణంలోని విద్యానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

వాలీబాల్ కిట్లను అందజేసిన సీఐ

మణుగూరు, ఏప్రిల్ 12: ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పల గుంపులో యువతకు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ శుక్రవారం వాలీ బాల్ కిట్లను అందజేశారు. గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక యువకులు పెడు మార్గాల నడకుండా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా యువతను స్టేషన్‌కు పిలిపించి వారికి వాలీ బాల్ కిట్లను అందజేశారు.

పేద విద్యార్థులకు చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 12: మణుగూరు మండల కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు రూ.10 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చెన్న కేశవరావు మాట్లాడుతూ.. తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమాఖ్య సహకారంతో ఈ చెక్కులను అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్ చదువుతున్న కల్లూరి మమత, వడ్డే సాయి, నంద గోపాల్‌లకు రూ.10 వేల చెక్కులను మండల కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం సభ్యులు పుచ్చకాయల శంకర్, సతీష్, పోశం భాస్కర్, ఉడతాని రవి, మానుకొండ ఉమాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 12: దేశం ప్రశాంతంగా ఉండాలన్న, సామ్రాజ్యవాదుల దోపిడీని అడ్డుకోవాలన్న, దేశ ప్రజాలకు కనీస ప్రజాస్వామిక హక్కులు దక్కాలన్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందు మండలం రొంపేడు గ్రామంలో భద్రాది కొత్తగూడెం, మహబుబాబాద్ జిల్లాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్, పెట్టుబడిదారుల దారదత్తం చేశాడని, మాయ మాటలతో దేశ ప్రజలను నరేంద్రమోడి ప్రభుత్వం వంచించుతున్నదని ఆరోపించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తూ మతోకల్లోలను సృష్టించేందకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, ప్రజలు అలోచించి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తుపాకుల నాగేశ్వరావు, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, నందగిరి వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, యాకన్న, సారంగపాణి, సీతారాములు, నక్రు, డి.ప్రసాద్, లక్ష్మినారాయణ, వై. ప్రకాశ్, లింగ్యా, రమేష్, నాగేశ్వరావు, నరాటి వెంకన్న, బొగ్గారపు సంగయ్య, పసిక రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండారి అయిలయ్య

ఉమామహేశ్వర జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ

గుండాల, ఏప్రిల్ 12;గుండాల మండల పరిధిలోని పడుగోనిగూడెం గ్రామంలో కిన్నెరసాని నది ఒడ్డున నిర్మించిన ఉమామహేశ్వర ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, దేవతా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ నిర్మాణ దాతలు గాడెపల్లి, లోకేశ్వరరావు, గంగాధర్, శిరోహిణి యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, గణపతి పూజలు ఆచరించి, యంత్రప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయ జీవధ్వజ శిఖర పరివాహ దేవతా ప్రతిష్ఠ, కళాన్యాసము, గో, కుంభ జ్వాలా దర్శనం, ఆలయ బలిహరణ, పూర్ణాహుతీ తయాహ్నిక దీక్షతో పూజా కార్యక్రమాలు వేదపండితులు కేతముక్కల పవణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు రామక్రిష్ణ శర్మ, సనత్ కుమార స్వామి, అర్చకులు ఉకె నాగయ్య, విద్యాశాఖ అధికారి పెండెకట్ల క్రిష్ణయ్య పాల్గొన్నారు.